# క్రైం కౌంటర్

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలుగు దినపత్రిక

సంపుటి : 03 సంచిక : 110 బుధవారం 28-01-2026 పేజీలు : 4 వెల : 2/-

Website:- https://www.crimecounter.in/



క్రైం కౌంటర్ News

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలంగాణ సూర్యాపేట్ జిల్లా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు

రిపోర్టర్లు కావలెను

- జిల్లా బ్యూరోలు
- నియోజక వర్గ ఇన్చార్జీలు

Contact No: 98497 07349


## కంటి శుక్లాల సర్జరీ పూర్తి చేసుకున్న143 మంది పేషెంట్లకు



సుంకిరెడ్డి సహకారంతో.

గత నెలలో కంటి శుక్లాల సర్జరీ పూర్తి చేసుకున్న143 మంది పేషెంట్లకు పునః సమీక్ష

క్రైమ్ కౌంటర్ న్యూస్ ప్రతినిధి రంగారెడ్డి జిల్లా: –

మాడుగుల పట్టణ కేంద్రంలోని వాసవి ఫంక్షన్ హాల్ లో

ప్రముఖ వైద్యులచే నిర్వహిస్తున్న పునః సమీక్ష ప్రక్రియను స్వయంగా పరిశీలించిన.ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు. టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పేషెంట్ల కంటి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుని, వైద్యులు వారికి ఇస్తున్న సలహాలు సూచనలను,ప్రత్యక్షంగా పరిశీలించి పేషెంట్ల ఆరోగ్య పరిస్థితి పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ,గత నెలలో ఏర్పాటు చేసిన క్యాంప్ లో 143 మంది కంటి శుక్లాల పేషెంట్లకు విజయవంతంగా కంటి శుక్లాల ఆపరేషన్లు పూర్తి చేశామని,ఈరోజు మరియు రేపు పేషెంట్ల పునః సమీక్ష ప్రక్రియ కొనసాగనుందని, పేదల కళ్లల్లో వెలుగులు నింపే ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని, ఎల్లప్పుడు పేద ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించడానికి ఐక్యత ఫౌండేషన్ సేవలు నిర్విరామంగా కొనసాగిస్తామని తెలిపారు.అలాగే చెన్నై వైద్య బృందం వారు పేషెంట్లకు ఆరోగ్యవంతమైన డైట్ ప్రక్రియను సూచిస్తూ,కంటి సంరక్షణకు తగిన సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది,మంగళవారం జరిగిన పునః సమీక్ష కార్యక్రమానికి హాజరైన పేషెంట్లు మాట్లాడుతూ...

ఎంతో ఖర్చుతో కూడుకున్న కంటి శుక్లాల ఆపరేషన్లు ఉచితంగా చేయించి,ఈరోజు వైద్యుల బృందంతో మరల పునః సమీక్ష నిర్వహించి,ఉచితంగా కంటి అద్దాలు కూడా అందిస్తున్నారని,మాకు పెద్ద కొడుకుల వెలుగులు నింపిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి ఎల్లవేళల రుణపడి ఉంటామని తెలుపుతూ,సుంకిరెడ్డి నిండు నూరేళ్ళు ఎల్లప్పుడూ సుఖసంతోషాలతో ఉండాలనింకోరుకుంటున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో.

ఐక్యత మాడుగుల ఇంచార్జ్ సూదిని జైపాల్ రెడ్డి, సభ్యులు రచ్చ శ్రీరాములు,శ్రీపతి,శేఖర్, నాగిళ్ళ శివ తదితరులు పాల్గొన్నారు.

## ముకుందాపురంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ




క్రైమ్ కౌంటర్ న్యూస్ నేరేడుచర్ల మండల రిపోర్టర్ పాశం లూకాస్ జనవరి 27

ముకుందాపురం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి నలమాద ఉత్తంకుమార్ రెడ్డి ఆశీస్సులతో నేరేడుచర్ల మండల పార్టీ అధ్యక్షులు కొణతం చిన్న వెంకటరెడ్డి సహకారంతో ఈరోజు ముకుందాపురంలో లబ్ధిదారులకు పగిడిపల్లి వెంకటేష్ మరియు పల్లె నాగేంద్రబాబు కు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రభుత్వం చేపట్టి చేస్తున్నటువంటి మంచి కార్యక్రమాలను అభినందించారు. ఇంకా ఎవరైనా ఉంటే ప్రభుత్వ తరఫున సహాయ సహకారాలు అందించడానికి గ్రామ శాఖ సిద్ధంగా ఉందని తెలియజేశారు.

## కల్వకుర్తి పురపాలక సంఘం ఎన్నికలకు ఏర్పాట్లు చేయుటకు సిబ్బందితో సమావేశం ఏర్పాటు...




కమీషనర్ మెహమూద్ షేక్....

క్రైమ్ కౌంటర్ న్యూస్ ప్రతినిధి కల్వకుర్తి: –

రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చినందున కల్వకుర్తి పురపాలక సంఘం నందు ఎన్నికల నిర్వహణకు అవసరమగు ఏర్పాట్లు అనగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులోకి వచ్చిందని, తేదీ 28.01.2026 నుండి నామినేషన్స్ తీసుకొనుటకు రిటర్నింగ్ అధికారులకు అవసరమగు ఏర్పాట్లు చేయటం జరిగిందని మరియు కార్యాలయం నందు నామినేషన్ సమర్పించేవారి కొరకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయటం జరిగిందని తెలియజేశారు. ఇట్టి కార్యక్రమం నందు సబ్ ఇన్స్పెక్టర్ మాధవరెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ షబ్బీర్ అహ్మద్, మేనేజర్ రాజకుమారి నోరి, సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ ని మర్యాదపూర్వకంగా కలిసిన ట్రాఫిక్ ఇన్స్పెక్టర్




మహబూబ్‌నగర్ జిల్లా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.రాజేందర్ రెడ్డి...

క్రైమ్ కౌంటర్ న్యూస్ ప్రతినిధి మహబూబ్ నగర్ జిల్లా: –

మహబూబ్‌నగర్ జిల్లా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై నియమితులైన ఇన్‌స్పెక్టర్ కె.రాజేందర్ రెడ్డి మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లాకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతలు స్వీకరించే క్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ కె.రాజేందర్ రెడ్డి నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట్ మండలం స్వస్థలవాసి. ఇంతకుముందు వికారాబాద్ జిల్లా తాండూరు ఇన్స్పెక్టర్‌గా, నారాయణపేట జిల్లా మరికల్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా, గద్వాల్ జిల్లా తదితర పోలీస్ స్టేషన్లలో సమర్థవంతంగా విధులు నిర్వహించారు.

ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ట్రాఫిక్ నిర్వహణ మరింత సమర్థవంతంగా చేపట్టి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ పోలీస్ శాఖ అభివృద్ధికి కృషి చేస్తానని సూచించారు.

ఇంతకుముందు మహబూబ్‌నగర్ జిల్లా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన భగవంత్ రెడ్డి నారాయణపేట జిల్లా మరికల్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా బదిలీ కావడంతో, వారి స్థానంలో కె. రాజేందర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించడం జరిగింది.

## సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా రజకులు ఎదగాలి




క్రైమ్ కౌంటర్ న్యూస్ నేరేడుచర్ల మండల రిపోర్టర్ పాశం లూకాస్ జనవరి 27

సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా రజకులు ఎదగాలని అందుకు చదువుకోవటం ఒక్కటే మార్గమని రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా నాయకులు చిలకరాజు శ్రీను,కొమ్రరాజు వెంకట్ అన్నారు. మంగళవారం నాడు సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపల్ కేంద్రంలో రజక వృత్తిదారుల సమాఖ్య కు సంబంధించిన కాలమానిని ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడుతూ ఇవాళ సమాజంలో ఆస్తులు అంతస్తులు ఎవరూ పట్టించుకోవడంలేదని కేవలం చదువు ద్వారానే సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు సరైన మార్గమని భావించి ఎవరైతే అంకితభావంతో చదువుకుంటారో వారే భవిష్యత్తులో ఉన్నత స్థానానికి చేరుకుంటారని చదివే మనిషికి జ్ఞానమని చదివే అనగారిన వర్గాల కులాల వారికి ఆశాజ్యోతి లాగా వారి కుటుంబాలను ఆదుకుంటుందని, రజక కులంలో ఉన్న ప్రతి ఒక్కరూ చదువుకొని ఉన్నత స్థానానికి ఎదిగి సమాజానికి ఆశదీపంల ఉండాలని వారు కోరారు. సమాజంలో రాజకీయానికి ఎంతో ప్రాధాన్యత ఉన్నదని అందువల్ల రజకులు రాజకీయంగా ఎదగాలని ప్రజల జీవితాలకు దిశా నిర్దేశం చేసి చట్టసభల్లో రజక జనాభా ప్రకారం తగు ప్రాతినిధ్యం లభించేలా ఐక్యమై ఐక్య ఉద్యమాలు నిర్వహించడం ద్వారా మన కులం ఉన్నత స్థానానికి వెళ్లాలని దశాబ్దకాలంగా రజక కులం మీద అనేక దాడులు జరిగాయని అది మనలో ఐకమత్యం లేకపోవడమే కారణమని అందువల్ల ముందు రజకులు ఐక్యం కావాలని వారు కోరారు. కార్యక్రమాల్లో రెడ్డిపల్లి వినయ్, అన్నారపు ఉపేందర్, తిరుపతమ్మ, ప్రభాకర్ ఎర్రబెల్లి సోమయ్య పాల్గొన్నారు.

## గణతంత్ర అవార్డు గ్రహీత కు ఘన సన్మానం



క్రైమ్ కౌంటర్ న్యూస్ నేరేడుచర్ల మండల రిపోర్టర్ పాశం లూకాస్ జనవరి 27

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలకు గాను కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రాలు అందుకున్న నేరేడుచర్ల వ్యవసాయ అధికారి జావిద్ గారిని శాలువాతో ఘనంగా సన్మానించిన హుజూర్నగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు రాపోలు నవీన్ కుమార్ మాట్లాడుతూ విధుల పట్ల అంకిత భావానికి నిదర్శనమే ఈ అవార్డుని జావిద్ కు జిల్లా ఉత్తమ అగ్రికల్చర్ ఆఫీసర్ గా కలెక్టర్ నుండి అవార్డు పొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫర్టిలైజర్ షాప్ యాజమాన్యం కోటేశ్వరరావు మరియు తక్కిళ్ళ నాగార్జున, ఆరే శ్రీకాంత్, అమరవరపు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు కేటాయించిన మూడు స్థానాల్లో బీసీలకే అవకాశం కల్పించాలి




– నేరేడుచర్ల అభ్యర్థుల ఎంపికలో మంత్రి మౌనం వీడాలి

– బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు

క్రైమ్ కౌంటర్ న్యూస్ నేరేడుచర్ల మండల రిపోర్టర్ పాశం లూకాస్ జనవరి 27

నేరేడుచర్ల మున్సిపాలిటీలో ఉన్న దాదాపు 14 వేల ఓట్లలో 7000 ఓట్లు బీసీలయే ఉన్నాయన్న విషయాన్ని మంత్రితో పాటు స్థానిక కాంగ్రెస్ పార్టీ నేతలు కూడా పరిగణలోకి తీసుకోవాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాల ధనుంజయ నాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం నాడు సూర్యపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపల్ కేంద్రంలో బీసీ హక్కుల సాధన సమితి కార్యాలయం శ్రీకాంతాచారి భవన్ లో విడుదల చేసిన పత్రిక ప్రకటనలో నేరేడుచర్ల మున్సిపాలిటీలో ఉన్న 7000 ఓటర్ల గాను కేవలం మూడు వార్డులు మాత్రమే బీసీలకు రిజర్వేషన్ దక్కిందని అందులోనూ 11, మరియు 12 వార్డులలో ముస్లిం మైనార్టీలకు ఇచ్చి బీసీలకు కేవలం ఒక్క వార్డు మాత్రమే కేటాయించారని, ఇది సరి అయినది కాదు అని ఆయన ప్రశ్నించారు. ముస్లిం మైనార్టీలకు బీసీ హక్కుల సాధన సమితి వ్యతిరేకం కాదని పట్టణంలోని ఎనిమిది జనరల్ వార్డులలో ముస్లిం మైనార్టీలకు స్థానాలు కేటాయించాలని ప్రత్యేకంగా బీసీ వార్డులే మైనార్టీ సోదరులకు కేటాయించడం సరికాదని ఇచ్చిన ఒక్క వార్డు కూడా అవసరం లేదని దానిని కూడా ఎవరైనా ముస్లిం మైనార్టీలకు దొరికితే 13వ వార్డు కూడా వారికే కేటాయించి కాంగ్రెస్ పార్టీ ఆనందం పొందాలని బీసీలు చైతన్యం అయితే ఏ లాంటి నిర్ణయం తీసుకుంటారో బీసీలే నిర్ణయించుకుంటారని అందుకు ఇల్లులు తిరిగి బీసీలను చైతన్యపరిచే బాధ్యత బీసీ హక్కుల సాధన సమితి సభ్యులు తీసుకుంటారని అందుకు సిద్ధంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీని ధనుంజయ నాయుడు హెచ్చరించారు. బిఆర్ఎస్ పార్టీ జనరల్ వార్డు 6 బీసీ కి కేటాయించారని అలాగే 12 ,13 వా ర్డులు కూడా బీసీలకు కేటాయించారని ఈ విషయాన్ని మంత్రి గా మీరు గమనంలో ఉంచుకోవాలని ఆయన కోరారు. ఆయన వెంట బీసీ హక్కుల సాధన సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యల్లబోయిన సింహాద్రి జిల్లా గౌరవ అధ్యక్షుడు చిలక రాజు శ్రీను జిల్లా సహాయ కార్యదర్శి కొమ్రరాజు వెంకట్, ఊదర వెంకన్న ఉన్నారు.

## ఖైరతాబాద్‌లో దారుణం..



హైదరాబాద్‌లో వీధి కుక్కల దాడులు ఆగడం లేదు. ఖైరతాబాద్‌లో నాలుగేళ్ల చిన్నారిపై కుక్క దాడి చేసి ముఖంపై తీవ్రంగా గాయపరిచింది. అధికారులు చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి దారుణంగా ఉంది. స్థానికులు వీధి కుక్కల బెడదతో భయాందోళనకు గురవుతున్నారు. హైదరాబాద్ నగరంలో వీధి కుక్కల స్వైరవిహారం మరోసారి రక్తాన్ని చిందించింది. జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి దారుణంగా ఉందనేందుకు ఈ ఘటనే నిదర్శనం. తాజాగా ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలో ఓ నాలుగేళ్ల చిన్నారిపై వీధి కుక్క విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. శ్రీనివాస్ నగర్‌కు చెందిన పాక శార్వి అనే నాలుగేళ్ల చిన్నారి సోమవారం సాయంత్రం తన ఇంటి ముందు సరదాగా ఆడుకుంటోంది. ఆ సమయంలో ఎక్కడి నుంచి వచ్చిందో ఏమో కానీ.. ఒక వీధి కుక్క ఒక్కసారిగా పాపపై దాడి చేసింది. చిన్నారి ఏమరుపాటుగా ఉన్న సమయంలో ఆమె ముఖంపై దాడి చేసి కొరికింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఓ బైక్ వాహనదారుడు సకాలంలో స్పందించి కుక్కను వెళ్లగొట్టడంతో పెద్ద ప్రమాదం తప్పింది. లేదంటే ఆ కుక్క చిన్నారి ప్రాణాలకే ముప్పు తెచ్చి ఉండేదని స్థానికులు చెబుతున్నారు. కుక్క దాడిలో శార్వి ముఖంపై లోతైన గాయాలయ్యాయి. రక్తసిక్తమైన చిన్నారిని కుటుంబ సభ్యులు హుటాహుటిన బంజారాహిల్స్‌లోని రెయిన్‌బో ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు పాపకు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. అప్పటివరకు కళ్లముందు ఆడుకున్న తమ బిడ్డ ఇలా ఆసుపత్రి పాలు కావడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. చిన్నారి ముఖంపై గాయాలు మానినా.. ఆ మచ్చలు, భయం పాపపై ఎలాంటి ప్రభావం చూపుతాయోనని వారు ఆందోళన చెందుతున్నారు. ఈ ఘటనతో శ్రీనివాస్ నగర్ వాసులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. కాలనీలో వీధి కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయిందని, పిల్లలను బయటకు పంపాలన్నా, కనీసం రోడ్లపై నడవాలన్నా భయం వేస్తోందని వారు వాపోతున్నారు. గతంలో కూడా ఇలాంటి దాడులు జరిగాయని.. జీహెచ్ఎంసీ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కుక్కలను పట్టుకెళ్లడం, మళ్లీ ఇక్కడే వదిలేయడం వల్ల సమస్య పరిష్కారం కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే స్థానిక ఎమ్మెల్యే, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు స్పందించి వీధి కుక్కల బెడద నుంచి తమకు శాశ్వత విముక్తి కలిగించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. నగరవ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొందని.. ఇకనైనా ప్రభుత్వం మేల్కొని కఠిన చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు.

# హైదరాబాద్‌లోని 'ఆ ఐకానిక్' బిల్డింగ్‌కు చోటు



హైదరాబాద్‌లోని నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డ్ ప్రధాన కార్యాలయం ప్రపంచంలోని అరుదైన నిర్మాణాలలో ఒకటిగా గుర్తింపు పొందింది. భారీ చేప ఆకారంలో నిర్మించిన ఈ భవనం.. 'మిమెటిక్ ఆర్కిటెక్చర్'కు నిదర్శనంగా నిలుస్తూ, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇది భారతదేశపు సృజనాత్మకతకు ప్రతీకగా నిలుస్తూ.. హైదరాబాద్ నగరానికి కొత్త ల్యాండ్‌మార్క్‌గా మారింది. ఐటీ పార్కులు, చారిత్రక కట్టడాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే హైదరాబాద్ నగరం ఇప్పుడు మరో అరుదైన ప్రపంచ గుర్తింపును సొంతం చేసుకుంది. నగరంలోని 'నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డ్' ప్రధాన కార్యాలయం ప్రపంచంలోని అత్యంత వింతైన, అద్భుతమైన నిర్మాణాల జాబితాలో చోటు సంపాదించుకుంది.

**నిర్మాణంలో ప్రత్యేకత.. 'మిమెటిక్ ఆర్కిటెక్చర్'**

2012లో నిర్మించిన ఈ నాలుగు అంతస్తుల భవనం, ఒక భారీ చేప ఆకారంలో ఉండటం దీని ప్రత్యేకత. ఈ బిల్డింగ్‌కి స్ఫూర్తి..1992లో పూర్తి అయిన బార్సిలోనా ఫ్రాంక్ గెహ్రీ స్మారక ఫిష్ శిల్పం. దాని ప్రేరణతో చేప ఆకారంలో బిల్డింగ్‌ని నిర్మించడం జరిగిందని అప్పటి ఫిషరీస్ అధికారులు మీడియాకు వెల్లడించారు. మిమెటిక్ ఆర్కిటెక్చర్‌కు ఒక ఉదాహరణగా ఉంటుందని ఆర్కిటెక్చర్ నిపుణులు చెబుతున్నారు. అంటే.. ఆ భవనం లోపల జరిగే పనిని ప్రతిబింబించేలా బయటి ఆకారం ఉంటుంది. మత్స్య శాఖకు సంబంధించిన కార్యాలయం కావడంతో.. దీనిని అచ్చం చేప ఆకారంలోనే నిర్మించారు. మెటాలిక్ షీన్, పెద్ద ఫిన్స్ (రెక్కలు), కళ్ల మాదిరిగా కనిపించే కిటికీలతో ఈ భవనం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. దీని ప్రవేశ ద్వారం రెండు మెట్లపై ఉన్న గుడారంలా నిర్మించారు.పగటిపూట ఒక భారీ చేపలా కనిపించే ఈ భవనం.. రాత్రి వేళల్లో నీలిరంగు స్పాట్‌లైట్ల వెలుగులో మరింత వింతగా కనిపిస్తుంది. చీకట్లో నీలి కాంతుల మధ్య చూస్తుంటే.. ఒక భారీ చేప నీటిలో ఈదుతున్నట్లు భ్రమ కలుగుతుంది. సాధారణంగా ప్రభుత్వ కార్యాలయాలు అంటే కాంక్రీటు దిమ్మెల్లా ఉంటాయనే భావనను చెరిపివేస్తూ.. ఒక సృజనాత్మక కట్టడంగా ఇది నిలిచింది. అంతర్జాతీయ స్థాయిలో అమెరికాలోని 'బాస్కెట్' ఆకారపు భవనం, పోలాండ్‌లోని 'క్రూక్డ్ హౌస్' (వంగిపోయిన ఇల్లు), ఫ్లోరిడాలోని 'గిటార్' ఆకారపు హోటళ్లతో పాటు ఇప్పుడు మన హైదరాబాద్ ' ఫిష్ బిల్డింగ్ ' కూడా ప్రపంచ వింత కట్టడాల జాబితాలో చేరింది. భారతదేశపు ప్రభుత్వ మౌలిక సదుపాయాల్లో ఇంతటి సృజనాత్మకత ఉండటం పట్ల అంతర్జాతీయంగా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఈ భవనం కేవలం ఒక ప్రభుత్వ కార్యాలయంగానే కాకుండా.. నగరానికి వచ్చే పర్యాటకులు తప్పనిసరిగా సందర్శించే ఒక ల్యాండ్‌మార్క్‌గా మారిపోయింది.

# ఆస్ట్రేలియా పౌరులే టార్గెట్..



ఖమ్మం జిల్లాలో బయటపడ్డ భారీ స్కాం కలకలం రేపుతోంది. ఆస్ట్రేలియా పౌరులను టార్గెట్ చేసి, మాల్‌వేర్ పేరుతో మోసం చేసి రూ.500 కోట్లకు పైగా కొల్లగొట్టిన కేటుగాళ్ల కేసులో పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. మ్యూల్ బ్యాంక్ ఖాతాల ద్వారా డబ్బు మళ్లించిన ఈ కేసులో కీలక సూత్రధారి ప్రవీణ్‌పై విచారణ కొనసాగుతోంది. ఖమ్మం జిల్లాలో ఇటీవల ఓ భారీ స్కాం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. కుబేర సినిమాలో మాదిరిగా మ్యూల్ బ్యాంక్ అకౌంట్లతో దాదాపు రూ.500 కోట్లకు పైగా కొల్లగొట్టారు కొందరు కేటుగాళ్లు. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఈ అంతర్జాతీయ సైబర్ ఫ్రాడ్ కేసులో కీలక సూత్రధారి పోట్రు ప్రవీణ్‌పై విచారణ ముమ్మరమైంది. ఆస్ట్రేలియా పౌరులను లక్ష్యంగా చేసుకుని సాగించిన ఈ భారీ స్కామ్‌లో సంపాదించిన సొమ్మును ఖమ్మం జిల్లాలోని స్థానిక నివాసితుల బ్యాంక్ ఖాతాల ద్వారా మళ్లించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. గతేడాది నవంబర్ 28న సైబరాబాద్ పోలీసులు ప్రవీణ్‌పై తొలి కేసు నమోదు చేశారు. మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీలో 'రిడ్జ్ ఐటీ సొల్యూషన్స్' పేరుతో ఒక నకిలీ కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి.. ఈ దందాను నడిపించినట్లు గుర్తించారు. 2024లో తన బంధువు ప్రకాష్‌తో కలిసి ఈ కేంద్రాన్ని ప్రారంభించిన ప్రవీణ్.. ఖమ్మంకు చెందిన గణేష్, చెన్నకేశవలతో పాటు పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఏడుగురు టెలికాలర్లను నియమించుకున్నాడు. వీరు ప్రధానంగా అశ్లీల వెబ్‌సైట్లు, ఇతర పోర్టల్‌లను సందర్శించే ఆస్ట్రేలియా పౌరులను టార్గెట్ చేసేవారు. బాధితులు వెబ్‌సైట్ ఓపెన్ చేయగానే.. వారి కంప్యూటర్ 'మాల్‌వేర్' బారిన పడిందని ఒక పాప్-అప్ మెసేజ్ వచ్చేలా చేసేవారు. దానిని పరిష్కరించుకోవడానికి స్క్రీన్‌పై ఉన్న నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించేవారు. బాధితులు కాల్ చేయగానే, టెలికాలర్లు సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులమని నమ్మించి.. వారి కంప్యూటర్లను 'రిమోట్ డెస్క్‌టాప్ అప్లికేషన్' ద్వారా యాక్సెస్ చేసేవారు. సర్వీస్ ఛార్జీల పేరుతో బాధితుల ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలను తస్కరించి.. వారి ఖాతాల్లోని సొమ్మును తొలుత ఆస్ట్రేలియాలోని భారతీయ విద్యార్థుల ఖాతాలకు ఆపై ఖమ్మంలోని స్థానికుల ఖాతాలకు మళ్లించేవారు. ఈ కేసులో జనవరి మొదటి వారంలో ఖమ్మం జిల్లా వి.ఎం. బంజర్ పోలీసులు ప్రవీణ్‌తో పాటు మరో 17 మందిని అరెస్ట్ చేశారు. అమాయక ప్రజలకు ఆశ చూపి వారి పేరుతో బ్యాంక్ ఖాతాలు తెరిపించి.. వాటి యాక్సెస్ ఐడీలను ప్రవీణ్ గ్యాంగ్ లాండరింగ్ కోసం వాడుకుంది. ఈ ఖాతాలకు దేశవ్యాప్తంగా నమోదైన వందలాది సైబర్ నేరాలతో సంబంధం ఉందని పోలీసులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడు ప్రవీణ్ ఒక గ్రాడ్యుయేట్. గతంలో బ్రిటన్‌లో కొన్ని ఏళ్ల పాటు పనిచేశాడు. అక్కడ నుంచి తిరిగి వచ్చిన తర్వాత సులభంగా డబ్బు సంపాదించే మార్గంగా సైబర్ మోసాలను ఎంచుకున్నాడు. సైబరాబాద్ కేసులో అరెస్ట్ కాకముందే హైకోర్టు నుంచి ముందస్తు బెయిల్ పొందిన ప్రవీణ్.. ప్రస్తుతం వి.ఎం. బంజర్ కేసులోనూ బెయిల్‌పై బయట ఉన్నాడు. అయితే.. నిందితులు విచారణకు సహకరించడం లేదని, బ్యాంక్ లావాదేవీల విశ్లేషణ ద్వారానే తాము ఆధారాలు సేకరిస్తున్నామని దర్యాప్తు అధికారులు వెల్లడించారు.

# రిజిస్టర్ మ్యారేజ్ చేసుకునే వారికి రేవంత్ సర్కార్ గుడ్‌న్యూస్



తెలంగాణలో రెవెన్యూ సేవలను వేగంగా, పారదర్శకంగా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 క్లస్టర్లుగా విభజించి, అత్యాధునిక సౌకర్యాలతో ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మిస్తున్నారు. వివాహ రిజిస్ట్రేషన్లకు మినీ మ్యారేజ్ హాల్, గర్భిణీలకు ఫీడింగ్ రూమ్స్, పిల్లలకు క్రెచ్ వంటి ప్రత్యేక వసతులు కల్పిస్తున్నారు. జిల్లా కేంద్రాల్లోనూ ఇలాంటి భవనాలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. తెలంగాణ ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత వేగంగా, పారదర్శకంగా అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం సచివాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లలో స్వార్థపూరిత నిర్ణయాల వల్ల చిన్నాభిన్నమైన రెవెన్యూ వ్యవస్థను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో సంస్కరిస్తున్నామని వెల్లడించారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఉన్న 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 క్లస్టర్లుగా విభజించినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక భారం పడకుండా, ప్రైవేటు నిర్మాణ సంస్థల సహకారంతో వీటిని అత్యాధునిక హంగులతో నిర్మిస్తున్నామన్నారు. సుమారు 3 నుంచి 5 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించే ఈ కార్యాలయాల్లో కేవలం రిజిస్ట్రేషన్లే కాకుండా, ప్రజల సౌకర్యార్థం అనేక ప్రత్యేక వసతులను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఈ సమీకృత భవనాల్లో కేవలం ఆఫీసులే కాకుండా సామాజిక అవసరాలకు ప్రాధాన్యతనిచ్చినట్లు పొంగులేటి వివరించారు. వివాహ రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే వారి కోసం ప్రత్యేకంగా 'మినీ మ్యారేజ్ హాల్' ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గర్భిణీలు, బాలింతల కోసం ఫీడింగ్ రూమ్స్, చిన్న పిల్లల కోసం క్రెచ్ సదుపాయం, వృద్ధులు, దివ్యాంగుల కోసం ఆధునిక లిఫ్ట్ సౌకర్యం, విశాలమైన వెయిటింగ్ ఏరియాలు. ఈ భవనాల నిర్మాణంతో పాటు ఐదేళ్ల నిర్వహణ బాధ్యతను కూడా సంబంధిత నిర్మాణ సంస్థలే చూసుకుంటాయని మంత్రి స్పష్టం చేశారు. రెండో విడతలో జిల్లా కేంద్రాల్లో కూడా ఇలాంటి ఇంటిగ్రేటెడ్ భవనాలను నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇప్పటికే తాలిమ్‌లో పనులు ముమ్మరంగా సాగుతున్నాయని.. జూన్ 2 నాటికి వాటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. బుధవారం పటాన్‌చెరు-శంకరపల్లి ప్రధాన రహదారి సమీపంలో రాజపుష్ప కన్‌స్ట్రక్షన్ నిర్మించే భవనానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో ఇప్పటికే తీసుకొచ్చిన స్లాట్ బుకింగ్, ఈ-ఆధార్ సంతకం వంటి సౌకర్యాలు ప్రజల సమయాన్ని ఆదా చేస్తున్నాయని, ఈ సంస్కరణలు ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకొస్తాయని పొంగులేటి ధీమా వ్యక్తం చేశారు.

# తిరిగి పుంజుకునేలా దీవించు తల్లి



మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర ప్రారంభం సందర్భంగా తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. అన్యాయంపై ఎదిరించిన త్యాగానికి, ధిక్కారానికి ఈ వనదేవతలు ప్రతీకలని, కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారంగా భక్తులు ఆరాధిస్తారని ఆయన కొనియాడారు. ఈ జాతర దక్షిణ భారత కుంభమేళాను తలపిస్తుందని, ఆదివాసీ గిరిజన సమాజాల అస్తిత్వాన్ని చాటిచెప్పే గొప్ప వేదిక అని కేసీఆర్ పేర్కొన్నారు. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర, తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాల ప్రతిబింబం 'మేడారం సమ్మక్క-సారలమ్మ' జాతర ప్రారంభం సందర్భంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అన్యాయంపై ఎదిరించి నిలబడిన త్యాగానికి, గిరిజన ధిక్కారానికి ఈ వనదేవతలు ప్రతీకలని ఆయన కొనియాడారు. కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారంగా భక్తులు సమ్మక్క-సారలమ్మలను ఆరాధిస్తారని కేసీఆర్ పేర్కొన్నారు. "కోట్లాదిగా తరలివచ్చే భక్తులతో మేడారం జాతర దక్షిణ భారత కుంభమేళాను తలపిస్తుంది. ఆధ్యాత్మికతతో పాటు ఆదివాసీ గిరిజన సమాజాల అస్తిత్వాన్ని చాటిచెప్పే గొప్ప వేదిక ఇది" అని ఆయన అన్నారు. భక్తులంతా తమ ఇలవేల్పులకు మొక్కులు తీర్చుకునే ఈ సమయంలో రాష్ట్రమంతా ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతుందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో తెలంగాణ సబ్బండ వర్ణాల సంస్కృతి, సంప్రదాయాలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చినట్లు కేసీఆర్ గుర్తుచేశారు. మేడారం వంటి మహా జాతరలకు నిధులు కేటాయించడంలోనూ, భక్తులకు సదుపాయాలు కల్పించడంలోనూ తమ ప్రభుత్వం ఎన్నడూ వెనుకడుగు వేయలేదన్నారు. గోదావరి లోయ పరీవాహక ప్రాంతంలో అభివృద్ధిని, ఆధ్యాత్మిక పురోగతిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్లామని ఆయన స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతి తిరిగి పుంజుకొని, తెలంగాణ ప్రజలు సుభిక్షంగా జీవించేలా దీవించాలని సమ్మక్క సారలమ్మ దేవతలను కేసీఆర్ ప్రార్థించారు. రాష్ట్ర అభ్యున్నతికి ఆ వనదేవతల దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. కాగా, రేపట్నుంచి జాతర ప్రారంభం కానుంది. ఈ జాతర ఉత్సవాల్లో ప్రతి రోజూ ఒక ప్రత్యేకత ఉంటుంది. మొదటి రోజు జనవరి 28న సారలమ్మను గద్దెల వద్దకు తీసుకురావడంతో జాతర మొదలవుతుంది. రెండవ రోజు జనవరి 29న చిలకలగుట్ట నుంచి సమ్మక్క అమ్మవారిని గద్దెపైకి తీసుకురానున్నారు. జనవరి 30న భక్తులు తమ బరువుకు తూగేలా 'బంగారం' (బెల్లం) అమ్మవార్లకు సమర్పించుకుని మొక్కులు తీర్చుకుంటారు. నాల్గవ రోజు జనవరి 31న అమ్మవార్లు వనప్రవేశం చేయడంతో మేడారం మహా జాతర ముగుస్తుంది.

# నేనే విద్యాశాఖ మంత్రి అయితే..



తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు గడిచినా నీళ్లు, నిధులు, నియామకాల లక్ష్యాలు నెరవేరలేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి దోపిడీ చేస్తున్నాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమని, తన కుమారుడి జ్ఞాపకార్థం నిర్మించిన పాఠశాలను మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలి పదేళ్లలో నీళ్లు, నిధులు, నియామకాల లక్ష్యం నెరవేరలేదని, ప్రజల సమస్యలు అలాగే ఉండిపోయాయని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నల్లగొండ పట్టణంలోని బొట్టుగూడలో కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు రూ. 8 కోట్ల వ్యయంతో పునర్నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి కార్పొరేట్ విద్యా సంస్థలపై నిప్పులు చెరిగారు. సమాజంలో పేదరికం పోవాలన్నా, సమస్యలు తీరాలన్నా నాణ్యమైన విద్య ఒక్కటే మార్గమని మంత్రి అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం ఏటా విద్యా రంగంపై వేల కోట్లు ఖర్చు చేస్తోందని, అయితే ఆ ఫలితాలు ఆశించిన స్థాయిలో అందడం లేదని పేర్కొన్నారు. తన కుమారుడు ప్రతీక్ రెడ్డి జ్ఞాపకార్థం నిర్మించిన ఈ పాఠశాలను దేశానికే ఒక 'మోడల్ స్కూల్'గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఆధునిక హంగులు, కంప్యూటర్ ల్యాబ్‌లు, డిజిటల్ బోర్డులు, క్రీడా ప్రాంగణాలతో నిర్మితమైన ఇటువంటి ప్రభుత్వ పాఠశాల దేశంలో మరెక్కడా ఉండదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రైవేటు విద్యా సంస్థల తీరుపై మంత్రి కోమటిరెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'శ్రీచైతన్య, నారాయణ వంటి సంస్థలు విద్యా వ్యాపారం చేస్తూ దొంగలుగా మారాయి' అని ఆయన మండిపడ్డారు. అడ్మిషన్ల సీజన్ వస్తే ఆ ఫీజుల దోపిడీ చూస్తుంటే భయం వేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు లక్షల ఫీజును రికమెండేషన్‌తో రెండు లక్షలకు తగ్గిస్తామని చెప్పడం పెద్ద మాయాజాలమని, అసలు ఆ సంస్థల ఫీజులే అత్యధికమని విమర్శించారు. చట్టప్రకారం ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాలని ఉన్నా.. కార్పొరేట్ శక్తులు ఆ చట్టాలను తుంగలో తొక్కి సామాన్యుల రక్తాన్ని పీలుస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో బీఈడీ, టెట్, డీఎస్సీ రాసిన మేధావులైన ఉపాధ్యాయులు ఉంటే.. ప్రైవేటు సంస్థల్లో అరకొర చదువులు చదివిన వారితో బోధన చేయిస్తున్నారని మంత్రి ఎద్దేవా చేశారు. కార్పొరేట్ విద్యా సంస్థలు కేవలం బట్టీ పద్ధతిని ప్రోత్సహిస్తున్నాయని, దీనివల్ల విద్యార్థుల్లో మార్కులు వస్తున్నా ఉద్యోగాలకు కావాల్సిన నైపుణ్యాలు ఉండటం లేదన్నారు. ఉన్నత చదువుల ఒత్తిడిని తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటానికి ఈ కార్పొరేట్ సంస్కృతే కారణమని అన్నారు. 'నాకు గనుక విద్యాశాఖ మంత్రిగా అవకాశం వస్తే.. ఈ కార్పొరేట్ దోపిడీ సంస్థలన్నింటినీ వెంటనే బంద్ చేయిస్తా' అని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్, పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి ఈ సందర్భంగా కోరారు.



## అగార్కర్‌కు అజారుద్దీన్ సూచన



దేశవాళీ క్రికెట్‌లో దుమ్ము రేపుతున్న సర్ఫరాజ్ ఖాన్ టీమిండియాలోకి రీ – ఎంట్రీ కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నాడు. విజయ్ హజారే, రంజీ ట్రోఫీల్లో భారీ సెంచరీలు బాది సెలెక్టర్ల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. టీమిండియా మాజీ కెప్టెన్ అజారుద్దీన్ సర్ఫరాజ్ ఆటతీరును ప్రశంసిస్తూ, అతనికి మరో అవకాశం ఇవ్వాలని అజిత్ అగార్కర్ నేతృత్వంలో ఉన్న సెలెక్షన్ కమిటీని కోరాడు. సర్ఫరాజ్ ఆకలి, అగ్రెసివ్ ఆటతీరు భారత జట్టుకు అవసరమని అజార్ అభిప్రాయపడ్డాడు. దేశవాళీ క్రికెట్‌లో అదరగొడుతున్న సర్ఫరాజ్ ఖాన్ టీమిండియాలోకి రీ ఎంట్రీ ఇచ్చేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాడు. భారత జట్టు తరపున సర్ఫరాజ్ చివరిసారిగా 2024లో ఆడాడు. ఆ తర్వాత తన ఫిట్‌నెస్‌కు ప్రధాన సమస్యగా మారిన బరువు తగ్గి తనను తాను నిరూపించుకున్నాడు.. తాజాగా దేశవాళీ క్రికెట్‌లో వరుసగా భారీ ఇన్నింగ్స్‌లతో సెలెక్టర్ల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. విజయ్ హజారే ట్రోఫీలో 157, 55, 62 పరుగులు చేసిన సర్ఫరాజ్.. రంజీ ట్రోఫీలో హైదరాబాద్‌పై ఏకంగా 227 పరుగులు బాది తన ఫామ్‌ను గట్టిగా చాటుకున్నాడు. ఈ ప్రదర్శనలతో మరోసారి టీమిండియా తలుపులు గట్టిగా తడుతున్నాడు. ఈ క్రమంలో సర్ఫరాజ్‌కు భారత మాజీ కెప్టెన్ అజారుద్దీన్ సపోర్ట్‌గా నిలిచాడు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన అజార్, సర్ఫరాజ్ ఆటతీరుపై ప్రశంసలు కురిపిస్తూ, సెలక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగర్కర్ మరో అవకాశం ఇవ్వాలని కోరాడు. సర్ఫరాజ్‌తో గడిపిన సమయాన్ని గుర్తు చేసుకున్న అజారుద్దీన్, రివర్స్ స్వింగ్‌ను ఎలా ఎదుర్కోవాలో తాను సూచనలు ఇచ్చినట్టు తెలిపాడు. ఒకసారి కలవడానికి సర్ఫరాజ్ దాదాపు 45 నిమిషాలు ఎదురుచూశాడన్న విషయాన్ని కూడా ప్రస్తావించారు. "అతను వెళ్లి ఆటలో తన పని తాను చేశాడు. పరుగులు చేశాడు.. అందుకే ప్రశంసలు అతనికే దక్కాలి. నా పేరు చెప్పాల్సిన అవసరం లేదు. అతను సక్సెస్ అవ్వడం నాకొక గిఫ్ట్ లాంటింది" అని అజారుద్దీన్ చెప్పారు. సర్ఫరాజ్ ఆట శైలిపై మాట్లాడిన అజార్ "అతను చాలా అగ్రెసివ్ బ్యాటర్. మ్యాచ్ పరిస్థితిని ఒక్కసారిగా మార్చగలడు. బౌలర్ ఆధిపత్యాన్ని అతను అస్సలు ఇష్టపడడు. మంచి బౌలర్‌ను మనం ఆధిపత్యం చెలాయించనిస్తే ఇబ్బంది పడాల్సిందే. స్వింగ్, బౌన్స్ ఉన్న పిచ్‌పై కూడా అతను వేగంగా పరుగులు చేయడం అతని క్వాలిటీని చూపిస్తోంది" అని అన్నారు. సర్ఫరాజ్ ఖాన్ 2024లో ఇంగ్లండ్‌తో జరిగిన హోమ్ టెస్టు సిరీస్‌లో భారత జట్టుకు అరంగేట్రం చేశాడు. తొలి టెస్టులో 62 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 68 పరుగులు చేసి వెంటనే గుర్తింపు తెచ్చుకున్నాడు. ధర్మశాలలో మరో అర్ధశతకం నమోదు చేసిన అతను, బెంగళూరులో న్యూజిలాండ్‌పై కెరీర్ బెస్ట్ 150 పరుగులు చేశాడు. ఆస్ట్రేలియాలో జరిగిన బోర్డర్–గవాస్కర్ ట్రోఫీకి జట్టులో ఉన్నప్పటికీ అతనికి తుది జట్టులో అవకాశం రాలేదు. ఆ తర్వాత ఇంగ్లండ్ టూర్‌కు ఎంపిక కాకపోవడంతో మళ్లీ దేశవాళీ క్రికెట్‌కే పరిమితమయ్యాడు. సర్ఫరాజ్ ఆకలిని చూసి తాను ఎంతో ఇంప్రెస్ అయ్యానని అజారుద్దీన్ తెలిపారు. "ఇండియాకి ఆడిన తర్వాత కూడా నేర్చుకోవాలనే తపన అతనిలో ఉంది. ఇది చాలా మంచి లక్షణం. నేను ఆటలో ఇబ్బంది పడుతున్నప్పుడు జహీర్ అబ్బాస్ నాకు మార్గనిర్దేశం చేశాడు. అలాగే సర్ఫరాజ్ కూడా ఎదుగుతాడు" అని అన్నారు. "అతనికి మరో అవకాశం తప్పకుండా రావాలి. అన్ని చోట్ల పరుగులు చేస్తున్నాడు. ఇలాంటి అటాకింగ్ బ్యాటర్లు భారత జట్టుకు అవసరం. పరుగులు చేసినా అవకాశం రాకపోతే నిరాశే మిగులుతుంది. కానీ అతనికి అవకాశం త్వరలోనే వస్తుందనే నమ్మకం నాకు ఉంది" అంటూ అజిత్ అగర్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీకి అజారుద్దీన్ సూచించారు.



# 90 పరుగులతో రిచా ఘోష్ విధ్వంసం సృష్టించినా తప్పని ఓటమి!



మహిళల ప్రీమియర్ లీగ్‌లో నాట్ సీవర్ – బ్రంట్ తొలి శతకంతో చరిత్ర సృష్టించింది. ఆమె అద్భుత శతకంతో ముంబై ఇండియన్స్ నిర్ణీత ఓవర్లలో 199 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో ఆర్సీబీ తరపున రిచా ఘోష్ ఒంటరి పోరాటం చేసినా, 15 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. రిచా ఘోష్ 90 పరుగులతో నాటౌట్‌గా నిలిచి విధ్వంసం సృష్టించింది. ఈ విజయంతో ముంబై పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి చేరింది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) చరిత్రలో నాట్ సీవర్–బ్రంట్ సరికొత్త చరిత్ర సృష్టించింది. టోర్నీ నాలుగో సీజన్‌లోనే తొలి శతకాన్ని నమోదు చేసిన ఆమె, ముంబై ఇండియన్స్‌కు కీలక విజయాన్ని అందించింది. సోమవారం వడోదరలో జరిగిన ఈ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ముంబై ఇండియన్స్ 15 పరుగుల తేడాతో ఓడించింది. ప్లే ఆఫ్స్ ఆశలను నిలబెట్టుకోవాల్సిన పరిస్థితిలో బరిలోకి దిగిన డిఫెండింగ్ ఛాంపియన్స్ ముంబై బ్యాటింగ్‌లో అద్భుత ప్రదర్శన చేసింది. 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. నాట్ సీవర్–బ్రంట్ 57 బంతుల్లో అజేయంగా 100 పరుగులు చేసి డబ్ల్యూపీఎల్ చరిత్రలో తొలి సెంచరీ చేసిన ప్లేయర్‌గా నిలిచింది. ఆమె ఇన్నింగ్స్‌లో 16 ఫోర్లు, ఒక సిక్స్ ఉన్నాయి. హేలీ మాథ్యూస్ కూడా 39 బంతుల్లో 56 పరుగులు చేసి కీలక పాత్ర పోషించింది. మూడో ఓవర్‌లో సజీవన్ సజనా ఔట్ అయిన తర్వాత క్రీజ్‌లోకి వచ్చిన మాథ్యూస్, సీవర్–బ్రంట్‌తో కలిసి రెండో వికెట్‌కు 131 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. ఈ జోడీ స్కోర్ బోర్డును పరుగులు పెట్టించడంతో ముంబై భారీ స్కోరు దిశగా దూసుకెళ్లింది. 200 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్సీబీకి ఆరంభంలోనే భారీ ఎదురుదెబ్బ తగిలింది. పవర్‌ప్లేలోనే 35 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి తీవ్ర ఒత్తిడిలో పడింది. అయితే రిచా ఘోష్ మాత్రం ఒంటరిగా పోరాడింది. 50 బంతుల్లో అజేయంగా 90 పరుగులు చేసిన రిచా 10 ఫోర్లు, 6 సిక్సులతో ముంబై బౌలర్లను చుక్కలు చూపించింది. చివరి రెండు ఓవర్లలోనే ఆర్సీబీ 43 పరుగులు రాబట్టినా, విజయానికి మాత్రం చేరువ కాలేకపోయింది. బౌలింగ్‌లో హేలీ మాథ్యూస్ మరోసారి రాణించింది. స్మృతి మంధానా, జార్జియా వాల్, రాధా యాదవ్ వికెట్లను తీసి మొత్తం 3 వికెట్లతో మ్యాచ్‌ను మలుపు తిప్పింది. షాబ్నిమ్ ఇస్మాయిల్ 2 వికెట్లు తీసింది. ఈ విజయంతో ముంబై ఇండియన్స్ ఏడు మ్యాచ్‌లలో ఆరు పాయింట్లతో పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి చేరుకుంది. ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ జెయింట్స్ కూడా ఆరు పాయింట్లతో ఉన్నప్పటికీ, మెరుగైన నెట్ రన్‌రేట్‌తో ముంబై ముందంజలో ఉంది. రిచా ఘోష్ ఒక్కటే ఒంటరి పోరాటం చేయడంతో బెంగళూరు జట్టు 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 184 పరుగులు మాత్రమే చేయగలిగింది. ముంబై ఇండియన్స్ 199 పరుగులు చేయడంతో, ఆర్సీబీ 15 పరుగుల తేడాతో ఓటమిపాలయింది. అయితే, ఈ మ్యాచ్‌లో నాట్ సీవర్ – బ్రంట్ సెంచరీ, రిచా ఘోష్ 90 పరుగులతో ప్రేక్షకులకు ఫుల్ మీల్స్ దొరికింది.

## టీ20 వరల్డ్‌కప్ ముందు టీమిండియా మేనేజ్‌మెంట్‌కు సలహా



టీమిండియా ఓపెనర్ సంజూ శాంసన్ ఫామ్ పై మాజీ ఆటగాడు అజింక్య రహానే స్పందించాడు. 2026 ఐసీసీ టీ – 20 వరల్డ్ కప్ ను దృష్టిలో ఉంచుకుని, ఆటగాడిపై నమ్మకం ఉంచాలని రహానే సూచించాడు. సంజూలో టాలెంట్ ఉందని కాస్త సహనం, ఆత్మవిశ్వాసంతో ఆడితే మళ్లీ ఫామ్ లోకి వస్తాడని అన్నాడు. అభిషేక్ శర్మతో పోల్చడం సరికాదని, తన సహజ ఆటను ఆడాలని సలహా ఇచ్చాడు. వైజాగ్‌లో మ్యాచ్ సంజూకి మరింత కీలకంగా మారింది. టీమిండియా ఓపెనర్‌గా ఆడుతున్న సంజూ శాంసన్‌కు ఈ సిరీస్ పెద్దగా కలిసి రావడం లేదు. న్యూజిలాండ్ టీ20 సిరీస్‌లో విఫలమవ్వడంతో విమర్శలు పెరుగుతున్న వేళ, మాజీ భారత బ్యాటర్ అజింక్య రహానే మాత్రం సంజూకి అండగా నిలవాలంటూ టీమ్ మేనేజ్‌మెంట్‌కు స్పష్టమైన సందేశం ఇచ్చాడు. 2026 టీ20 వరల్డ్ కప్‌కు ఇంకా సమయం ఉన్న నేపథ్యంలో, ఇలాంటి దశలో ఆటగాడిపై నమ్మకం చూపించడమే చాలా ముఖ్యమని రహానే అభిప్రాయపడ్డాడు. సంజూలో టాలెంట్ లోపం లేదని కాస్త సహనం, స్పష్టత ఉంటే మళ్లీ ఫామ్‌లోకి వస్తాడని చెప్పాడు. గువాహటి టీ20లో సంజూ గోల్డెన్ డక్‌గా వెనుదిరగడంతో పరిస్థితి మరింత కఠినంగా మారింది. ఇప్పటివరకు మూడు మ్యాచ్‌ల్లో అతను చేసిన పరుగులు కేవలం 16 మాత్రమే. ప్రపంచకప్‌కు ముందు ఇది ఆందోళన కలిగించే అంశమే అయినా, ఈ దశలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదని రహానే సూచించాడు. రహానే క్రిక్‌బజ్‌తో మాట్లాడుతూ "మేనేజ్‌మెంట్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఇద్దరూ సంజూకి మద్దతుగా నిలుస్తారని నాకు నమ్మకం ఉంది. అతను క్వాలిటీ ప్లేయర్. ఆట అతనిలో ఉంది. తన మీద తానే నమ్మకం పెట్టుకోవాలి అంతే" అని అన్నాడు. టీ20 ఫార్మాట్‌లో కొన్నిసార్లు అవుట్ అయ్యే విధానం అందంగా ఉండకపోవచ్చని, కానీ దాంతో భయపడాల్సిన పనిలేదని కూడా రహానే స్పష్టం చేశాడు. "ఈ ఫార్మాట్‌లో బ్యాటర్ కొన్నిసార్లు బాగా కనిపించకుండా అవుట్ అవుతాడు. అది ఓకే. ముఖ్యమైంది ఆత్మవిశ్వాసం. ఫ్రీగా ఆడటం, తన ఆటపై నమ్మకం ఉంచడం" అని చెప్పాడు. ఇదే సమయంలో ఫామ్‌లో ఉన్న అభిషేక్ శర్మతో సంజూని పోల్చడం సరైంది కాదని రహానే స్పష్టంగా చెప్పాడు. "అభిషేక్ మరో రకం ఆటగాడు. సంజూ ఆట శైలి వేరు. అతను రాజస్థాన్ రాయల్స్ కోసం ఆడిన మంచి ఇన్నింగ్స్‌లను గుర్తు చేసుకోవాలి. తన సహజ ఆటను బయటపెట్టాలి" అని సూచించాడు. సంజూ మళ్లీ ఫామ్‌లోకి రావాలంటే పెద్ద స్కోరు అవసరం లేదని "15 బంతుల్లో 25, లేదా 20 బంతుల్లో 30 – 35 పరుగులు చేసినా చాలు. కాస్త ఎక్కువ సేపు క్రీజ్‌పై ఉండాలి. తొలి ఓవర్, రెండో ఓవర్ దాటాక ఆటను ముందుకు తీసుకెళ్లాలి" అని వివరించాడు. ఇక మరోవైపు అభిషేక్ శర్మ వరుసగా మెరుపు ఇన్నింగ్స్‌లతో వార్తల్లో నిలుస్తున్నాడు. తాజా మ్యాచ్‌లో కేవలం 14 బంతుల్లోనే అర్ధశతకం చేసి జట్టుకు సులభమైన విజయం అందించాడు. సిరీస్ భారత్ ఖాతాలో పడినప్పటికీ, సంజూ ఫామ్ మాత్రం ఇంకా ఆందోళన కలిగిస్తోంది. గత తొమ్మిది ఇన్నింగ్స్‌ల్లో ఓపెనర్‌గా సంజూ చేసిన పరుగులు మొత్తం 104 మాత్రమే. సగటు 11.55. స్ట్రయిక్‌రేట్ ఉన్నా, నిలకడ లేకపోవడం టీమ్ మేనేజ్‌మెంట్‌కు పరీక్షగా మారింది. ఇప్పుడు నాలుగో టీ20 కోసం జట్టు విశాఖపట్నం వెళ్లనున్న నేపథ్యంలో, సంజూకే మరో అవకాశం ఇస్తారా? అన్నది ఆసక్తిగా మారింది.

## లక్ కాదు క్లాస్..



ఐసీసీ టీ – 20 వరల్డ్ కప్‌కు ముందు టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఫామ్‌లోకి రావడం శుభ పరిణామం. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో వరుస అర్ధశతకాలతో సత్తా చాటాడు. గత కొంతకాలంగా పరుగుల కోసం కష్టపడిన సూర్య, కీలక సమయంలో రిథమ్ అందుకోవడంతో అభిమానులు, టీమ్ మేనేజ్‌మెంట్ ఆనందంలో ఉన్నారు. లెజెండరీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ కూడా సూర్య ఫామ్‌పై ప్రశంసలు కురిపించారు. కివీస్‌పై జరిగిన చివరి రెండు మ్యాచ్‌లలో హాఫ్ సెంచరీలతో రాణించాడు. టీ20 వరల్డ్ కప్‌కు ముందు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఫామ్‌లోకి రావడం టీమిండియాకు కలిసొచ్చే అంశం. న్యూజిలాండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో వరుసగా రెండు అర్ధశతకాలు సాధించి ఫామ్‌లోకి వచ్చాడు. గత కొంతకాలంగా పరుగుల కోసం కష్టపడిన సూర్య, కీలక సమయంలో రిథమ్ అందుకోవడంతో టీమ్ మేనేజ్‌మెంట్‌తో పాటు అభిమానులు కూడా ఫుల్ హ్యాపీగా ఉన్నారు. గత ఏడాది ఫామ్ కోల్పోయిన సూర్య, ఈ ఏడాది మాత్రం ధాటిగా ఆడటం మొదలుపెట్టాడు. రాయ్‌పూర్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో 37 బంతుల్లో 82 పరుగులు చేసిన సూర్య, ఆ తర్వాత మూడో టీ20లో 26 బంతుల్లోనే 57 పరుగులు చేసి మరోసారి తన క్లాస్‌ను చూపించాడు. ఈ ఇన్నింగ్స్‌తో న్యూజిలాండ్ నిర్దేశించిన 209 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ సులువుగా ఛేదించింది. సూర్య తిరిగి ఫామ్‌లోకి రావడంపై లెజెండ్రీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ ప్రశంసలు కురిపించాడు. రాయ్‌పూర్ ఇన్నింగ్స్‌నే సూర్యకు ఆత్మవిశ్వాసం ఇచ్చిందని గవాస్కర్ అభిప్రాయపడ్డాడు. "సూర్య ఫామ్ కోల్పోలేదు, పరుగులే రావడం లేదు అంతే. రాయ్‌పూర్‌లో ఆ ఇన్నింగ్స్ అతనికి కావాల్సిన నమ్మకాన్ని ఇచ్చింది" అని గవాస్కర్ వ్యాఖ్యానించాడు. అక్టోబర్ 2024 తర్వాత సూర్య 23 ఇన్నింగ్స్‌ల పాటు అర్ధశతకం చేయలేకపోయాడు. ఆ సమయంలో ఒకసారి మాత్రమే 40కి పైగా స్కోర్ చేయగలిగాడు. కానీ రాయ్‌పూర్ మ్యాచ్‌లో ఆ తొలినాళ్ల ఇబ్బందులు దాటుకుని పవర్‌ప్లే తర్వాత దూకుడు పెంచి ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. నెట్స్‌లో సూర్య ఎప్పుడూ బాగా బ్యాటింగ్ చేస్తున్నాడని గవాస్కర్ వెల్లడించాడు. "నెట్స్‌లో అతను బంతిని క్లియర్‌గా కొడుతున్నాడు. కానీ మ్యాచ్‌ల్లో క్లిక్ అవ్వడం లేదు. చాలాసార్లు అదృష్టం అవసరం అవుతుంది. కానీ ఈసారి సూర్యకు అదృష్టం కూడా అవసరం లేకపోయింది. ఆ ఇన్నింగ్స్‌నే అతను తిరిగి గాడిలో పడటానికి కారణం" అని గవాస్కర్ చెప్పాడు. మొత్తానికి టీ20 వరల్డ్ కప్ సమీపిస్తున్న వేళ కెప్టెన్‌గా, కీలక బ్యాటర్‌గా సూర్య ఫామ్‌లోకి రావడం భారత జట్టుకు పెద్ద ఊరటగా మారింది.





# అతడితో రిలేషన్ చాలా డేంజర్ అనిపించింది..



మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తన జీవితంలో రెండు సార్లు ప్రేమలో హృదయం విరిగిందని ఆమె భావోద్వేగంగా వెల్లడించారు. టీనేజ్‌లో మొదటి ప్రేమను కెరీర్ కోసం వదిలేశానని, మరో రిలేషన్ తన వ్యక్తిత్వానికి, భవిష్యత్తుకు 'డేంజర్'గా మారిందని తెలిపారు. ఈ వ్యాఖ్యలతో నెటిజన్లు ఆమె మాజీ ప్రియుడు విజయ్ వర్మనే ఉద్దేశించిందా అని చర్చిస్తున్నారు. 'లస్ట్ స్టోరీస్ 2' తర్వాత వీరి మధ్య ప్రేమాయణం, ఆపై బ్రేకప్ వార్తలు వినిపించిన సంగతి తెలిసిందే. దాదాపు రెండు దశాబ్దాలుగా సినీ పరిశ్రమలో అగ్రశ్రేణి హీరోయిన్‌గా తన స్థానాన్ని నిలబెట్టుకున్న మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా మరోసారి వార్తల్లో నిలిచారు. గ్లామర్ పాత్రలతో పాటు నటనకు ప్రాధాన్యం ఉన్న క్యారెక్టర్లు చేస్తూ టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్‌లలో తనకంటూ ప్రత్యేక ఇమేజ్‌ను ఏర్పరుచుకున్న ఈ భామ, సినిమాలకంటే ఎక్కువగా తన వ్యక్తిగత జీవితంతో తరచూ చర్చకు వస్తుంటారు. ముఖ్యంగా నటుడు విజయ్ వర్మతో సాగిన ప్రేమాయణం, ఆ తర్వాత జరిగిన బ్రేకప్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తమన్నా చేసిన వ్యాఖ్యలు ఈ చర్చకు మరింత ఊపునిచ్చాయి. ఇండస్ట్రీలో డేటింగ్, రిలేషన్‌షిప్స్, బ్రేకప్స్ అనేవి కొత్త విషయం కాదు. కానీ హీరోయిన్ల విషయంలో మాత్రం ఇవి రోజుకొక కొత్త కథలా బయటకు వస్తుంటాయి. ఈ నేపథ్యంలో తమన్నా తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన ప్రేమ జీవితానికి సంబంధించిన కొన్ని భావోద్వేగ విషయాలను తొలిసారి ఓపెన్‌గా షేర్ చేసుకున్నారు. తన జీవితంలో రెండుసార్లు హార్ట్ ముక్కలైందని చెప్పిన ఆమె, ఆ అనుభవాలను చాలా స్పష్టంగా వివరించారు. "నేను టీనేజ్‌లో ఉన్నప్పుడే మొదటిసారి ప్రేమలో పడ్డాను. కానీ నా లక్ష్యాలు, కెరీర్ కోసం ఆ బంధాన్ని వదులుకోవాల్సి వచ్చింది" అని ఆమె అన్నారు. అప్పట్లో కెరీర్‌కు ప్రాధాన్యం ఇవ్వడమే సరైన నిర్ణయంగా భావించానని తెలిపారు. ఆ తర్వాత మరో వ్యక్తితో రిలేషన్‌లో ఉన్నానని, కానీ కొంతకాలానికి అతను తనకు సరైన జోడీ కాదని అర్థమైందని తమన్నా చెప్పారు. "అలాంటి బంధంలో ఉండటం నా వ్యక్తిత్వానికి, భవిష్యత్తుకు ప్రమాదకరం అని గ్రహించి బయటకు వచ్చాను" అని ఆమె వ్యాఖ్యానించారు. ముఖ్యంగా 'డేంజరస్' అనే పదాన్ని ఉపయోగించడం ఇప్పుడు నెటిజన్లలో ఆసక్తిని రేపింది. ఈ మాటలు వినగానే ఆమె విజయ్ వర్మనే ఉద్దేశించిందా? అనే సందేహాలు మొదలయ్యాయి. విజయ్ వర్మతో తమన్నా ప్రేమాయణం గురించి బీటౌన్‌లో కొంతకాలంగా గట్టిగానే చర్చ జరిగింది. 'లస్ట్ స్టోరీస్ 2' వెబ్ సిరీస్‌లో కలిసి నటించిన సమయంలో వీరిద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగిందని ప్రచారం జరిగింది. ఆ సిరీస్‌లోని లిప్‌లాక్, ఇంటిమేట్ సీన్స్ తర్వాత వీరు నిజజీవితంలోనూ ప్రేమలో ఉన్నారని వార్తలు వైరల్ అయ్యాయి. ఈవెంట్స్‌కు కలిసి హాజరవడం, ఫోటోషూట్స్ చేయడం, పండగల సమయంలో కలిసి కనిపించడం వంటి కారణాలతో త్వరలో పెళ్లి కూడా చేసుకుంటారని చాలామంది భావించారు. కానీ అనుకోకుండా వీరి బంధానికి బ్రేక్ పడింది.బీటౌన్ టాక్ ప్రకారం, తమన్నా పెళ్లి గురించి ఆలోచించగా, విజయ్ వర్మ మాత్రం కెరీర్‌పైనే ఎక్కువ దృష్టి పెట్టాడని, అదే కారణంగా ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయని ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో తమన్నా తాజా వ్యాఖ్యలు ఆ పాత రూమర్లను మళ్లీ తెరపైకి తెచ్చాయి. "ప్రేమ కంటే ఆత్మగౌరవం, కెరీర్ ముఖ్యం" అన్నట్లుగా ఆమె తీసుకున్న నిర్ణయాన్ని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. ఇక కెరీర్ విషయానికి వస్తే, తమన్నా ప్రస్తుతం సినిమాలతో బిజీగానే ఉన్నారు. గత ఏడాది 'ఓదెల 2' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆమె ఓ మోస్తరు విజయాన్ని అందుకుంది. ఒకవైపు కమర్షియల్ సినిమాలు చేస్తూనే, మరోవైపు ఓటీటీలో వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటోంది.

# అంచనాలు పెంచేసిన గ్లింప్స్




యూత్ ఐకాన్ విజయ్ దేవరకొండ ప్రస్తుతం కీలక దశలో ఉన్నాడు. వరుస ఫెయిల్యూర్స్ తర్వాత ఆయన 14వ సినిమా ఎణ14పై భారీ అంచనాలు నెలకొన్నాయి. రాహుల్ సాంకృత్యాయన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి 'రణబాలి' అనే టైటిల్ ఖరారైనట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ మూవీ రాయలసీమ చారిత్రక నేపథ్యంతో, బండి నారాయణస్వామి రచించిన అవార్డు విన్నింగ్ నవల 'శప్తభూమి' ఆధారంగా తెరకెక్కుతోందనే టాక్ హాట్ టాపిక్‌గా మారింది. కరువు, పాలకుల దౌర్జన్యాల మధ్య సామాన్యుల పోరాటమే కథాంశమని సమాచారం. యూత్ ఐకాన్‌గా టాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటుడు విజయ్ దేవరకొండ కెరీర్ ప్రస్తుతం ఒడిదుడుకు మధ్య సాగుతోంది. 'పెళ్లి చూపులు'తో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి, 'గీత గోవిందం'తో కెరీర్ బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ అందుకున్న విజయ్, తన సహజమైన నటనతో పాటు యూత్‌ను ఆకట్టుకునే ఇమేజ్‌ను తెచ్చుకున్నాడు. అయితే ఇటీవల కాలంలో ఆయన నుంచి వచ్చిన సినిమాలు ఆశించిన స్థాయిలో సక్సెస్ సాధించకపోవడం అభిమానుల్లో కొంత నిరాశను కలిగిస్తోంది. అయినప్పటికీ, విజయ్ మాత్రం కొత్త కథలు, విభిన్న నేపథ్యాలతో సినిమాలు చేస్తూ తన కెరీర్‌ను మళ్లీ ట్రాక్‌లో పెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. ఈ క్రమంలో విజయ్ దేవరకొండ 14వ సినిమాగా తెరకెక్కుతున్న 14 ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. 'ట్యాక్సీవాలా', 'శ్యామ్ సింగరాయ్' వంటి విభిన్న చిత్రాలతో దర్శకుడిగా పేరు తెచ్చుకున్న రాహుల్ సాంకృత్యాయన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ విజయ్‌ను ఇప్పటివరకు ఎప్పుడూ చూడని పవర్‌ఫుల్ అవతారంలో చూపించి, సినిమాపై భారీ హైప్ క్రియేట్ చేసింది. అంతేకాదు, 'మమ్మీ' ఫేమ్ హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లో ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తున్నట్లు వెల్లడి కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై పాన్ ఇండియా స్థాయిలో ఆసక్తి పెరిగింది. ఈ మూవీకి ' రణబాలి ' అనే టైటిల్ ఖరారు చేసినట్లు ప్రకటించిన మేకర్స్ అందుకు సంబంధించి అదిరిపోయే గ్లింప్స్‌ని వదిలి అందరినీ సర్‌ప్రైజ్ చేశారు. ఇప్పుడు ఈ సినిమాకు సంబంధించిన మరో ఆసక్తికరమైన ప్రచారం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇది ప్రముఖ రచయిత బండి నారాయణస్వామి రచించిన రాయలసీమ చారిత్రక నవల 'శప్తభూమి' ఆధారంగా తెరకెక్కుతున్నట్లు వినిపిస్తోంది. 2017లో ప్రచురితమైన 'శప్తభూమి' నవల, 18వ శతాబ్దంలో రాయలసీమ ప్రాంతంలో ముఖ్యంగా అనంతపురం వంటి కరువు ప్రాంతాల్లో జరిగిన సామాజిక, రాజకీయ పరిణామాలను హృదయానికి హత్తుకునేలా ఆవిష్కరించింది. ఆ కాలంలో అధికారంలో ఉన్న హండే రాజుల పాలన, పాలెగాళ్ల దౌర్జన్యాలు, దళిత బహుజన వర్గాల జీవన పోరాటాలు, సామాజిక అంతరాలు ఈ నవలలో ప్రధానంగా ప్రతిఫలిస్తాయి. ఈ అద్భుతమైన రచనకు 2019లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించడం విశేషం. 'శప్తభూమి'లోని పాత్రలు ఒక్కొక్కటి బలమైన భావోద్వేగాలతో పాఠకుల మనసుల్లో నిలిచిపోతాయి. ఇమ్మడమ్మఉకోడనీలడు విషాద ప్రేమ కథ, కథానాయకుడిగా నిలిచే బిల్లె ఎల్లప్ప వీరగాథ నవలకి ప్రాణంగా నిలుస్తాయి. ఇలాంటి బలమైన సాహిత్యాన్ని సినిమాటిక్ రూపంలోకి తీసుకొస్తే, 'రణబాలి' ఒక శక్తివంతమైన హిస్టారికల్ డ్రామాగా మారే అవకాశముందని అభిమానులు భావిస్తున్నారు. అయితే ఈ విషయంపై మేకర్స్ నుంచి ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక విజయ్ దేవరకొండ ప్రస్తుత కెరీర్ విషయానికి వస్తే, 'ఖుషీ'తో మంచి విజయం అందుకున్న తర్వాత ఆయన చేసిన 'ది ఫ్యామిలీ స్టార్' ఆశించిన ఫలితం ఇవ్వలేదు. అలాగే గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో వచ్చిన 'కింగ్డమ్' కూడా ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. ప్రస్తుతం ఆయన రవికిరణ్ కోల దర్శకత్వంలో 'రౌడీ జనార్ధన' అనే మరో యాక్షన్ డ్రామాలో నటిస్తున్నాడు. ఫ్యాన్స్ మాత్రం విజయ్ తిరిగి 'పెళ్లి చూపులు', 'గీత గోవిందం' లాంటి సింపుల్, ఎమోషనల్ కథల వైపు రావాలని కోరుకుంటుంటే.... విజయ్ మాత్రం పాన్ ఇండియా స్థాయిలో ప్రభావం చూపే మాస్, హిస్టారికల్, యాక్షన్ కథలపై దృష్టి పెట్టినట్లు కనిపిస్తోంది. ఈ ప్రయత్నాల్లో 'రణబాలి' నిజంగా 'శప్తభూమి' ఆధారంగా తెరకెక్కితే, అది విజయ్ దేవరకొండ కెరీర్‌లో ఒక కీలక మైలురాయిగా నిలిచే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# వాటే బ్యూటీ అనేలా దివ్య భారతి.. బ్లూ డ్రెస్‌లో సూపర్ ఫోటోలు



'కాలా', 'వలిమై' చిత్రాలతో దక్షిణాది ప్రేక్షకులకు దగ్గరైన బాలీవుడ్ నటి హుమా ఖురేషి.. ప్రస్తుతం యష్ హీరోగా వస్తున్న 'టాక్సిక్' సినిమాలో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్ మధ్యలో ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసిన లేటెస్ట్ గ్లామరస్ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ పిక్స్ మీరూ చూసేయండి. బాలీవుడ్ సెన్సేషనల్ బ్యూటీ హుమా ఖురేషి ప్రస్తుతం సౌత్ సినీ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. రజనీకాంత్ సరసన 'కాలా' చిత్రంలో జరీనాగా నటించి తన నటనతో మెప్పించిన ఈ భామ, అజిత్ కుమార్ యాక్షన్ డ్రామా 'వలిమై'లో కూడా కీలక పాత్ర పోషించి తెలుగు మరియు తమిళ ప్రేక్షకులకు ఎంతగానో దగ్గరైంది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ కన్నడ రాకింగ్ స్టార్ యష్ కథానాయకుడిగా గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'టాక్సిక్' (ఽశీ×అఎ: ూా ఖీఱఅతీఎ ఖ్రీవ టశీతీ +తీశీషఅ-బజూం) లో 'ఎలిజబెత్' అనే పవర్‌ఫుల్ పాత్రను పోషిస్తోంది. ఈ చిత్రంలో తన ఫస్ట్ లుక్ ఇప్పటికే విడుదలయ్యి నెట్టింట భారీ అంచనాలను పెంచేసింది; ఒక స్మశానవాటిక నేపథ్యం, వింటేజ్ కార్‌తో కూడిన ఆమె గౌతిక్ లుక్ హాలీవుడ్ స్థాయిని తలపిస్తోంది. ఈ భారీ ప్రాజెక్ట్ షూటింగ్ శరవేగంగా సాగుతుండగా, సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉండే హుమా ఖురేషి తాజాగా కొన్ని అత్యంత గ్లామరస్ ఫోటోలను షేర్ చేసింది. ఈ ఫోటోల్లో ఆమె తన స్టైలిష్ అవుట్‌ఫిట్స్ మరియు బోల్డ్ ఎక్స్‌ప్రెషన్స్‌తో కుర్రకారుకు నిద్రలేకుండా చేస్తోంది. చిరునవ్వుతో పాటు తనలోని రాజసాన్ని ప్రతిబింబించేలా ఉన్న ఈ స్టిల్స్ క్షణాల్లో వైరల్ అవ్వగా, నెటిజన్లు ఆమె అందాన్ని ఆకాశానికెత్తుతున్నారు. ముఖ్యంగా 'టాక్సిక్' లాంటి యాక్షన్ థ్రిల్లర్‌లో యష్ వంటి స్టార్ పక్కన హుమా నటిస్తుండటంతో ఈ సినిమా ఆమె కెరీర్‌కు మరో టర్నింగ్ పాయింట్ అవుతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. మార్చి 19, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమాకు సంబంధించి ఆమె చేసే ప్రతి పోస్ట్ ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. కేవలం నటనలోనే కాకుండా సోషల్ మీడియా క్వీన్‌గా కూడా హుమా ఖురేషి తన హవా కొనసాగిస్తూ, తన లేటెస్ట్ ఫోటోషూట్‌తో నెట్టింట కొత్త వైరల్ వేవ్‌ని సృష్టించింది. హుమా ఖురేషి అందం, అభినయం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు; గ్లామర్‌తో పాటు నటనకు ఆస్కారమున్న పాత్రల్లో ఆమె ఒదిగిపోయే తీరు అద్భుతం. తాజా ఫోటోషూట్‌లో ఆమె ధరించిన ట్రెండీ అవుట్‌ఫిట్స్ ఆమెలోని కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తున్నాయి. ముఖ్యంగా 'టాక్సిక్' చిత్రంలో 'ఎలిజబెత్' పాత్ర కోసం ఆమె చేసిన మేకోవర్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. 1970ల నాటి వింటేజ్ లుక్‌లో, స్మశానవాటిక నేపథ్యం మరియు భారీ రాతి విగ్రహాల మధ్య ఆమె ఇచ్చిన ఫోజులు ఒక 'డార్క్ ఫెయిరీ టేల్' వైబ్‌ను పంచుతున్నాయి. గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో హుమా పాత్ర కేవలం అతిథి పాత్ర కాదని, కథను మలుపు తిప్పే అత్యంత బలమైన పాత్ర అని సమాచారం. కియారా అద్వానీ 'నాడియా'గా, నయనతార 'గంగ'గా నటిస్తున్న ఈ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌లో హుమా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. కేవలం సినిమాలకే పరిమితం కాకుండా, వెబ్ సిరీస్ ప్రపంచంలో కూడా ఆమె 'మహారాణి' వంటి సిరీస్‌లతో తన సత్తా చాటిన విషయం తెలిసిందే. ఇప్పుడు యష్ వంటి మాస్ హీరోతో స్క్రీన్ షేర్ చేసుకోవడం ఆమె కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలవనుంది. 'టాక్సిక్' సినిమాను ఏకకాలంలో కన్నడ మరియు ఇంగ్లీష్ భాషల్లో చిత్రీకరిస్తుండటం, రాజీవ్ రవి వంటి జాతీయ అవార్డు గ్రహీత సినిమాటోగ్రఫీ బాధ్యతలు చూస్తుండటంతో ఈ చిత్రం విజువల్స్ హాలీవుడ్ తరహాలో ఉంటాయని తెలుస్తోంది. షూటింగ్ విరామంలో ఆమె పోస్ట్ చేస్తున్న ఈ సరికొత్త స్టిల్స్ సినిమా ప్రమోషన్లకు ఎంతో దోహదపడుతున్నాయి. బ్లాక్ ఆఫ్-షోల్డర్ గౌన్‌లో ఆమె చూపించిన రాజసం, గాంభీర్యం నెటిజన్లను కట్టిపడేస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఈ సినిమా నుంచి ఆమెకు సంబంధించిన మరిన్ని అప్‌డేట్స్ రానున్న నేపథ్యంలో, అభిమానులు ఆమె సోషల్ మీడియా ఖాతాలను నిశితంగా గమనిస్తున్నారు. హుమా ఖురేషి తన కెరీర్‌లో చేస్తున్న ఈ ప్రయోగాలు ఆమెను కేవలం బాలీవుడ్ నటిగా కాకుండా, ఒక గ్లోబల్ ఐకాన్‌గా మార్చే దిశగా సాగుతున్నాయి.

Owned by Katikala Vara Prasad,Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Banka Indira . at D.no. 465 Le out no2. Dodleru Road. Ysr jagananna colony. Krosuru.Guntur AP. 522410. Editor. Katikala Vara Prasad.RNI APTEL/2015/62250. Ph:9849707349 email:kvp6858@gmail.com